వర్సిటీ భూములతో వ్యాపారాలు వద్దు

- జీవో 55ను వెనక్కి తీసుకోవాల్సిందే
- వర్సిటీ గొంతుకోసి చరిత్ర హీనులు కావొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరిక
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ విద్యార్థులకు మద్దతు

యూనివర్సిటీని సందర్శించి విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వియ్ వాంట్ జస్టిస్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 20: వ్యవసాయ యూనివర్సిటీ భూములతో వ్యాపారం తగదని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వడాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విరమించుకోవాలని, లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీని శనివారం ఆయన సందర్శించి విద్యార్థుల నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 55ను తక్షణం రద్దు చేసి తెలంగాణకు గుండెకాయ వంటి వర్సిటీని కాపాడాలని సీఎంకు సూచించారు. విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. 40 ఏండ్లకు పైగా ఇక్కడ ఉన్న వృక్ష సంపదను నాశనం చేయడం కంటే నీచ సంస్కృతి మరోటి ఉండదని మండిపడ్డారు. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మనమే రైతు మెడనొక్కినట్టు అవుతుందని పేర్కొన్నారు. ఔషధ మొక్కలు, విత్తన భాండాగారాన్ని నాశనం చేసి చరిత్ర హీనులుగా మిగలొద్దని సూచించారు. గతంలో బడా నేతలు కబ్జా చేసిన కేబీఆర్, ఇందిరాపార్క్ స్థలాల్లో హైకోర్టు నిర్మించాలని సలహా ఇచ్చారు. రాష్ర్టాన్ని నాశనం చేయాలని చూస్తే సహించబోమని తేల్చిచెప్పారు. విద్యార్థులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ర్యాలీగా బయోడైవర్సిటీ పార్కుకు వెళ్లి మొక్కలు నాటారు.

నినాదాలతో మార్మోగిన ప్రాంగణం

యూనివర్సిటీ భూములను కాపాడాలంటూ విద్యార్థులు చేపట్టిన నిరసన శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు చేసిన నినాదాలతో యూనివర్సిటీ ప్రాంగణం దద్దరిల్లింది. 'సేవ్ యూనివర్సిటీ ల్యాండ్స్', 'సేవ్ ఫార్మర్స్', 'స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్' అంటూ నినదించారు. పాలెం, వరంగల్, సిరిసిల్ల, అశ్వారావుపేట, జగిత్యాల, ఆదిలాబాద్, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాలల యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు కూడా నిరసనలకు దిగారు. జీవో నంబర్ 55ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్ పాల్గొన్నారు.

కాళేశ్వరం లేకుంటే ఎస్సారెస్పీ-2 కష్టమే!

- మేడిగడ్డలో రిపేర్లున్నా నీటి ఎత్తిపోతకు చాన్స్
- పంపుల హెడ్ మెయింటెన్ చేస్తే చాలు
- అందుబాటులోకి అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు
- ప్రాణహితలో కొనసాగుతున్న 6 వేల క్యూసెక్కులు
- 10 టీఎంసీలకుపైగా నీటిని లిఫ్ట్ చేసుకొనే అవకాశం
- దృష్టిపెట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు తీరుతో ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద ఉన్న ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించటం కష్టంగా మారే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుత సర్కారు తీరు రైతన్నలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత సర్కారును బద్నాం చేయడంపై పెట్టిన దృష్టిని, పంటలు ఎండిపోకుండా తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంలో చూపటం లేదు. బరాజ్‌లు రిపేర్‌లో ఉన్నా నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నా, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. వెరసి ప్రాణహిత నుంచి వచ్చే జలాలు దిగువకు వృథాగా పోతున్నాయి. మరోవైపు ప్రాజెక్టుల్లో నిల్వలు చూస్తే ప్రతిపాదించిన ఆయకట్టుకు నీరందడం కష్టంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరందేనా?

ఎస్సారెస్పీ స్టేజ్-1లో అంటే ఎల్ఎండీకి ఎగువన అంటే ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ 0-146 కిలోమీటర్ల వరకు 4,62,920 ఎకరాలు, దిగువన అంటే కాకతీయ కెనాల్ 146-284 కిలోమీటర్ల వరకు 5,05720 ఎకరాలు మొత్తంగా 9,68,640 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉన్నది. అందులో 1/3 తరి, 2/3 మెట్టపంటలకు నీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. కాకతీయ కాలువను 284 కిలోమీటర్ నుంచి 347 కిలోమీటరు వరకు ఎస్సారెస్పీ స్టేజ్-2గా పిలుస్తారు. దీని కింద 3,71,691 ఎకరాలు ఉన్నది. ఆ తరువాత అది మూసీలో కలుస్తుంది. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళ్లు ఉంటేనే స్టేజ్-1 కింది ఆయకట్టుకు యాసంగిలో నీటి భరోసా ఉంటుంది. స్టేజ్-2 పరిస్థితి అంతంతే. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకే పరిమితం చేసింది. దిగువ ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని అందించాలని సంకల్పించింది. ఆ మేరకు నీటిని ఎప్పటికప్పుడు లిఫ్ట్ చేస్తూ మూడేండ్లుగా ఎస్సారెస్పీ స్టేజ్-2 చివరి ఆయకట్టుకు విజయవంతంగా సాగునీటిని అందించింది. ఈ ఏడాది యాసంగిలో కూడా ఎస్సారెస్పీ స్టేజ్-1, స్టేజ్-2 కింద 11.26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ప్రస్తుతం ఎస్సారెస్పీ, మిడ్‌మానేర్, ఎల్లంపల్లి, ఎల్ఎండీ ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవు. 100 టీఎంసీల లోపే ఉంటాయని తెలుస్తున్నది. దాదాపు మరో 10 టీఎంసీల వరకు అవసరం అవుతాయని అధికారుల అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరందుతుందా? అన్నది అనుమానంగా మారింది.

ప్రస్తుతం నీటి నిల్వలు

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)
ఎస్సారెస్పీ	90	58.36
ఎల్లంపల్లి	20	13.4
రాజరాజేశ్వర	25	14.82
ఎల్ఎండీ	22	19.37
మొత్తం	157	105.95

(నోట్: ఇందులో రాబోయే వానకాలం వరకు దాదాపు అన్ని ప్రాజెక్టులు కలిపి తాగు నీటి అవసరాలకు సుమారు 5 టీఎంసీలకు పైగా నీరు అవసరం అవుతుంది. నికరంగా 100 టీఎంసీల కంటే తక్కువే అందుబాటులో ఉంటుందని చెప్పవచ్చు)

ఇప్పటికీ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి మొదలు దిగువ ఉన్న పార్వతి, సరస్వతి బరాజ్‌లకు ఎగువ నుంచి చుక్క నీరు రావడం లేదు. అయినప్పటికీ వాటి దిగువన ఉన్న లక్ష్మీబరాజ్ వద్ద ఇప్పటికీ నీటి ప్రవాహాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రాణహిత నుంచి సగటున రోజుకు 6 వేల క్యూసెక్కుల నీరు లక్ష్మీ బరాజ్(మేడిగడ్డ)కు వస్తున్నది. అయితే బరాజ్ పిల్లర్ల కుంగుబాటు ఘటన, పరీక్షల నేపథ్యంలో గేట్లన్నీ ఓపెన్ చేసి దిగువకు ఆ జలాలను విడుదల చేస్తున్నది. కానీ ప్రస్తుతం బరాజ్ డ్యామేజీ ప్రాంతంలో కాఫర్ డ్యామ్‌ను 96.5 మీటర్ల ఎత్తుతో నిర్మించారు. 95 మీటర్ల మేర నీటి ప్రవాహ ఎత్తును మెయింటెన్ చేస్తే జలాలు అప్రోచ్ చానల్‌కు, తద్వారా పంప్‌హౌజ్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఎత్తిపోసుకోవచ్చు. ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల సీపేజీలను కూడా అధికారులు ఇప్పటికే అరికట్టారు. గ్రౌటింగ్ పూర్తి చేసి పరీక్షలు నిర్వహించారు. ఇబ్బందేమీ లేదని నిర్ధారణకు వచ్చారు. బరాజ్ రిపేర్లు కొనసాగుతున్నా సాంకేతికంగా జలాలను ఎత్తిపోసుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కచ్చితంగా ఎత్తిపోసుకోవాల్సిందేనని, లేదంటే చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమేనని అధికారులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు

ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ సర్కారును బద్నాం చేయటంపైనే దృష్టి సారించింది తప్ప, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా జలాలను ఎత్తిపోసుకోవాలనే దానిపై మాత్రం దృష్టి సారించడం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడుతూ రైతు ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. జలాలను ఎత్తిపోయడం ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకే కాదు ప్రాజెక్టుకు అనుసంధానించిన ఇతర ప్రాజెక్టులు, చెరువులను కూడా నింపవచ్చని, తద్వారా వాటికింది ఆయకట్టుకు కూడా పూర్తి భరోసా కల్పించవచ్చనే ఆలోచన చేయడం లేదు.

మనదగ్గరే నీళ్లున్నా ఉరుకుడెందుకు?

- శ్రీశైలంలో 16, సింగూరులో 24 టీఎంసీల నిల్వలు

ప్రత్యామ్నాయ మార్గాలను పట్టించుకోని సర్కారు

- సాగర్‌లో డెడ్‌స్టోరేజీకి దిగువనా వినియోగించుకునే వెసులుబాటు
- అయినా కర్ణాటక, మహారాష్ట్ర వైపు చూపు
- ప్రభుత్వానికి 'కొయినా' ప్రతిపాదనలు



హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): తాగునీరు కోసం మహారాష్ట్ర, కర్ణాటక వెంట పరుగులు తీస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అధికారులు విస్తుపోతున్నారు. ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని, వాటితో రాష్ట్ర అవసరాలు తీరుతాయని అధికారులు చెప్తున్నా మంత్రుల బృందం మాత్రం త్వరలోనే కర్ణాటక పర్యటనకు సిద్ధమవుతున్నది. రాష్ర్టానికి ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు కృష్ణాబేసిన్‌లో 43.94 టీఎంసీలు అవసరమవుతాయి. వీటిలో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 16.5 టీఎంసీలు, పబ్లిక్ యుటిలిటీ కోసం 4టీఎంసీలు అవసరం కాగా, సాగర్ కింద 11.69 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. రాబోయే ఆరునెలల కాలానికి 21.97టీఎంసీలు అవసరం. శ్రీశైలం ప్రాజెక్టుల్లో తాగునీటి అవసరాలకు సరిపోను జలాలతోపాటు మిగులు జలాలు అందుబాటులో ఉన్నాయి.

సాగర్, శ్రీశైలంలో 82.78 టీఎంసీలు

సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో 82.78 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తేల్చి అందులో 35 టీఎంసీలు తెలంగాణకు, 45 టీఎంసీలు ఏపీకి కేఆర్ఎంబీ ఇప్పటికే కేటాయించింది. తెలంగాణకు కేటాయించిన నీటిలో ప్రస్తుతం 8టీఎంసీలు వినియోగానికి ఇంకా అందుబాటులో ఉన్నాయి. ఏపీకి శ్రీశైలం కింద 30, సాగర్ కింద 15 మొత్తంగా 45 టీఎంసీలను కేఆర్ఎంబీ కేటాయించింది. శ్రీశైలంలో నీటిని వినియోగించుకోలేకపోతున్నామని చెప్తూ ఏపీ సర్కారు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడం, తదనంతర పరిణామాలతో సాగర్ ద్వారా 5 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతినిచ్చింది. మరోవైపు, శ్రీశైలంలో 826 అడుగుల వద్ద మొత్తంగా 45.61టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. అందులో 800 అడుగుల వరకు వెళ్లినా ఇంకా 16 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని అధికారుల అంచనా. ఏపీని సంప్రదించి, కేఆర్ఎంబీని ఒప్పించి జలాలను దిగువన సాగర్‌కు విడుదల చేయించుకునే అవకాశముంది. అదే సమయంలో విద్యుదుత్పత్తి కూడా చేసుకోవచ్చు. అయినా తెలంగాణ సర్కారు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. సుదూరంలో ఉన్న కొయినా డ్యాం నుంచి నీళ్లు తెచ్చుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటకతో సంప్రదింపులు జరుపుతామంటున్నదని కానీ, అధికారుల చెప్తున్న అంశాలపై ఎందుకు దృష్టిసారించడం లేదన్నది ఎవరికీ అంతుపట్టని విషయంగా మారింది.

జూరాల, సింగూరులోనూ

సాగర్ ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. నగర అవసరాలకు 16.5 టీఎంసీలు అవసరం. ఆరు నెలల కాలానికి 8 టీఎంసీలకు పైగా కావాలి. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 526 అడుగులు కాగా, 152 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ 505 అడుగుల వద్ద 123 టీఎంసీలను మాత్రమే పరిగణలోకి తీసుకుని ఇరు రాష్ర్టాలకు జలాలు కేటాయించింది. సాగర్‌లో 490 అడగుల డెడ్‌స్టోరేజీ వరకు వెళ్లి వినియోగించుకునే అవకాశముంది. అంటే మరో 23టీఎంసీలు సాగర్‌లోనే అందుబాటులోనే ఉండనున్నాయి. గతంలో ఇలా వినియోగించుకొన్న సందర్భాలు కోకొల్లలు. సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీల సామర్థ్యానికి గాను 24 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉన్నాయి. సాగునీటి అవసరాలు పోయినా దాదాపు 20 టీఎంసీలు ఇంకా అందుబాటులో ఉండే అవకాశముంది. శ్రీశైలం కింద కల్వకుర్తి తదితరాల అవసరాలకు సరిపోయే విధంగా ఎగువన జూరాలలో కూడా నీరు అందుబాటులో ఉంది. జూరాల పూర్తిస్థాయి సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.15 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఇన్ని ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకుండా పొరుగు రాష్ర్టాల వెంటపడడంలో ఆంతర్యమేంటో అంతుచిక్కడం లేదు.

కొయినా నీళ్ల కోసం సీఎంవోకు ప్రతిపాదనలు

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం మహారాష్ట్రలోని కొయినా డ్యాం నుంచి నీటిని తెచ్చుకోవాలని భావిస్తున్నది. కొయినా సామర్థ్యం 100 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 67 టీఎంసీలున్నాయి. అందులో 37టీఎంసీలను ఆ రాష్ట్రం సాగు, తాగునీటి అవసరాలను కేటాయించుకోగా, మిగిలిన 30 టీఎంసీలను జలవిద్యుత్తు కోసం వాడుకోవాల్సి ఉంది. విద్యుదుత్పత్తి కోసం మహారాష్ట్ర ప్రభుత్వం దాచుకున్న నీటిని విడుదల చేస్తే ఆ మేరకు పరిహారం ఇస్తామని చెప్తున్న తెలంగాణ ప్రభుత్వం అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సాగునీటిశాఖ అధికారులను ఆదేశించింది. తాజాగా, ఆ ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. తమకు కొయినా నీళ్లిస్తే ప్రతిగా డబ్బులు ఇస్తామని ప్రతిపాదించినట్టు తెలిసింది. జలవిద్యుత్తు ద్వారా వచ్చే ఆదాయాన్ని తామే సమకూర్చుతామని చెప్పి 'మహ' ప్రభుత్వాన్ని ఒప్పించాలని నిర్ణయించినట్టు సమాచారం. మహారాష్ట్ర ప్రభుత్వం ఒక టీఎంసీ నీటితో 40 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుండడంతో ఆమేరకు లెక్కకట్టి అంచనాలు తయారుచేశారు. యూనిట్‌కు రూ.4 నుంచి రూ. 8 వరకు ఆయా స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

అందేవి సగం నీళ్లే!

మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరి కొయినా నుంచి నీళ్లు విడుదలైనా సాగర్‌కు చేరుకునేది మాత్రం సగం నీళ్లేనని చెప్తున్నారు. దాదాపు 50 మేరకు నీటి సరఫరా నష్టాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ పూర్తినీటికి సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అడిగిన ప్రతిపాదనలతోపాటు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా అధికారులు ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది. ప్రభుత్వం మాత్రం వీటిని పట్టించుకోకుండా ముందుకే వెళ్లాలని నిర్ణయించినట్టు సమాచారం. అందులో భాగంగా మంత్రుల బృందం త్వరలోనే కర్ణాటకలో పర్యటిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అగ్రి ఉద్యాన వర్సిటీ భూములు హైకోర్టుకు వద్దు : ఏబీవీపీ

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ ఉద్యాన వర్సిటీకి చెందిన భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, జీవో నం. 55ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్రశాఖ కోరింది. ఈ మేరకు శనివారం తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శికి ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ప్రజల ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమని తెలిపారు. దీనికి అనుబంధ వ్యవసాయ వర్సిటీలో పరిశోధనలు జరిగే ప్రదేశాన్ని హైకోర్టు నిర్మాణానికి అప్పగించడం దారుణమని పేర్కొన్నారు. వెంటనే జీఓ 55ను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, సిటీ సెక్రటరీ శ్రీకాంత్, స్టేట్ జాయింట్ సెక్రటరీ శ్రీనాథ్, పృథ్వీ తేజ, కళ్యాణి తదితరులు ఉన్నారు.

సాగు నీళ్లియ్యకుంటే మనల్ని ఉరికిస్తరు

- చెరువులను బాగుచేయాలి
- మోరంచపల్లి బాధితులకు సాయమెప్పుడు?
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గండ్ర, దొంతి మాధవరెడ్డి
- వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష
- సురేఖ, సీతక్క, పొన్నం హాజరు
- పోలీసు పహారాలో సమీక్ష
- మీడియాకు అనుమతి నిరాకరణ

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్, జనవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, అధికారుల తీరుపై సొంతపార్టీ ఎమ్మెల్యేలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు సాగునీరు ఇవ్వకుంటే రైతులు ఉరికిస్తారని హెచ్చరించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల సమీక్ష సమావేశం జరిగింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఆరు జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. పోలీసు పహారా మధ్య జరిగిన ఈ సమావేశానికి మీడియాను అనుమతించ లేదు. పలువురు ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ఉన్నదున్నట్లుగా మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గాల్లో సాగునీటి సరఫరా అంశంపై ఈ సెగ్మెంట్ల ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి మంత్రుల ముందే అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలోని పాకాల ఆయకట్టుకు యాసంగిలో నీళ్లు ఇచ్చే విషయంలో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే దొంతి కోరారు. చెరువుల కింద ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా భరోసా కల్పించాలని, అధికార యంత్రాంగం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోనూ సాగునీటి సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ''గత జూలైలో వచ్చిన భారీ వర్షాలతో భూపాలపల్లి నియోజకవర్గంలో బాగా నష్టం జరిగింది. 70 చెరువులకు మరమ్మతులు అవసరం ఉన్నది. చెరువులకు మరమ్మతులు చేసి నీళ్లు ఇయ్యాలి. లేకుంటే రైతులు ఉరికిస్తరు. వరదలతో మోరంచపల్లి ఊరు మొత్తం మునిగిపోయింది. ఐదుగురు చనిపోయారు. అంతా కొట్టుకుపోయింది. వరదలు వచ్చి ఇన్ని నెలలైనా ఆ ప్రాంతం వాళ్లకు ఎలాంటి సాయం అందించలేదు. మళ్లీ వానాకాలం వచ్చేటట్టు ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం తరపున ఏదో ఒకటి చేయాలి. గొర్లవీడు ఇందిరాసాగర్ ప్రాజెక్టును త్వరగా కట్టాలి. చెరువులను బాగు చేసి నీళ్లు నింపాలి'' అని కోరారు. ఎండాకాలంలో తాగునీటి సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేల ప్రతిపాదనలు పట్టించుకోని మంత్రులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభివృద్ధిపై సమీక్షలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు అవసరమైన పనుల మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను మంత్రులు పెద్దగా పట్టించుకోలేదు. కొత్త పనుల సంగతి ఇప్పుడు వద్దని, బడ్జెట్ తర్వాత చూద్దామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మంజూరుచేసిన పనులలో 70 శాతం వరకు పూర్తయిన వాటిని మాత్రమే కొనసాగించాలని చెప్పారు. మిగిలిన అన్ని పనులను సమీక్షించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులు ఇస్తున్నదని, ప్రాధాన్యత ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీలకు ఆహ్వానం లేదు

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యేలను తప్ప ఎవరినీ ఆహ్వానించలేదు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్లను ఈ సమావేశానికి ఆహ్వానించకపోవడంపై అధికారుల్లోనూ చర్చ జరిగింది. ప్రభుత్వపరంగా జరిగిన సమావేశానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమైంది.

పోలీసు పహారా

మంత్రుల సమీక్ష సమావేశం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మొత్తం పోలీసులతో నిండిపోయింది. ఆరు జిల్లాలకు చెందిన వందల మంది పోలీసులు హనుమకొండ కలెక్టరేట్‌లోనే ఉన్నారు. గతంలో ముఖ్యమంత్రులు వచ్చినప్పుడు సైతం లేనంతమంది పోలీసులు మంత్రుల పర్యటనలో ఉండడంపై వరంగల్ నగర ప్రజలు చర్చించుకున్నారు. హైదరాబాద్ మార్గంలో వరంగల్ నగర శివారు నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు అడుగడుగునా పోలీసులు ఉన్నారు.

సమీక్షలో కాంగ్రెస్ నేతలు

ప్రభుత్వపరంగా నలుగురు మంత్రులు నిర్వహించిన సమీక్ష సమావేశం ఎమ్మెల్యేలకు మాత్రమే అని చెప్పినా కాంగ్రెస్ నేతలు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమీక్షలో పాల్గొన్నారు.

కమిటీల పేరుతో బీజేపీ కాలయాపన

- ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చిన గత కమిటీలు
- మళ్లీ కమిటీ అంటే మోసమే
- టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి


విద్యానగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్/గోదావరిఖని, జనవరి 20: మాదిగల న్యాయమైన ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను పరిష్కరించకుండా కమిటీల పేరుతో కేంద్రంలోని బీజేపీ సర్కారు కాలయాపన చేస్తున్నదని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మండిపడ్డారు. గతంలోనే పలు కమిటీలు వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చినా మళ్లీ కమిటీ ఏర్పాటు చేయడమంటేనే మరోసారి మాదిగలను మోసం చేయబోతున్నట్టని చెప్పారు. శనివారం విద్యానగర్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం 20 ఏండ్లుగా ఉద్యమిస్తున్నా పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టకుండా నాడు కాంగ్రెస్, నేడు బీజేపీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీల పేరుతో కోర్టుల చుట్టూ తిప్పుతూ మాదిగల ఓట్లు అవసరం వచ్చినప్పుడల్లా కమిటీలు, కమిషన్లు అంటూ నాటకాలాడుతున్నారని విమర్శించారు. బీజేపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా త్వరలో జరిగే చివరి పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, లేదా రాష్ర్టాలకు ఎస్సీ వర్గీకరణ చేసుకొనే అధికారాన్ని కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

దళితబంధును అమలు చేయాలి

దళితుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన టీఎస్ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. తక్షణమే దళితబంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు.



అన్నారం బరాజ్ వద్ద కొనసాగుతున్న గ్రౌటింగ్

- నేడో, రేపో రానున్న కెమికల్

కాళేశ్వరం, జనవరి 20 : కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌లో కెమికల్ వేయడానికి గ్రౌటింగ్ ప్రిపరేషన్ పనులు కొనసాగుతున్నాయి. బరాజ్‌లో కొన్ని నెలల క్రితం ఏర్పడిన నీటి బుడగల గుంతలకు పూడ్చడం కోసం హిమాచల్‌ప్రదేశ్ నుంచి ప్రత్యేకమైన కెమికల్ తెప్పించి సీపేజ్‌లో మరమ్మతుల పనులు చేపడుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన పాలీయూరిత్రిన్ కెమికల్‌తో 3వ బ్లాక్‌లో దిగువ వైపు ఏర్పడిన గుంతను మూసివేశారు. మూసిన బుంగకు 15 రోజుల పాటు పరిశీలనలో ఉంచి పరీక్షించనున్నారు. 4వ బ్లాక్‌లో ఏర్పడిన గుంతను పూడ్చడం కోసం మరికొంత కెమికల్ తెప్పిస్తున్నారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

- పాలెం వాగు ప్రాజెక్టు కెనాల్‌కు మరమ్మతు చేయాలని డిమాండ్
- సర్కార్ తీరుపై ఆదివాసీల నిరసన

వెంకటాపురం(నూగూరు), జనవరి 20 : పాలెం వాగు ప్రాజెక్టు నుంచి సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలోని చిరుతపల్లి ప్రధాన రహదారిపై బర్లగూడెం సర్పంచ్ కొర్స నర్సింహమూర్తి, ఆదివాసీ నవ నిర్మాణ సేన (ఏఎన్ఎస్) రాష్ట్ర నాయకులు వాసం నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ రైతులు రాస్తారోకో నిర్వహించి, రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి, నాగరాజు మాట్లాడుతూ.. 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.70.99 కోట్లతో పాలెం వాగు ప్రాజెక్టు (మట్టితో)ను ప్రారంభించగా, అప్పట్లోనే రెండుసార్లు గండ్లుపడి కొట్టుకుపోయిందన్నారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నదని తెలిపారు. నాలుగు క్రషర్ గేట్లను ఏర్పాటు చేసి ఈ ప్రాజెక్టును 2017లో మంత్రి హరీశ్‌రావు ప్రారంభించినట్టు వారు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వెంకటాపురం మండలంలోని 32 గ్రామాలకు, వాజేడు మండలంలోని 7 గ్రామాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని కనీసం వెయ్యి ఎకరాలకైనా నీళ్లు ఇవ్వాలని కోరారు. రూ.కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు నీళ్లు రైతులకు ఉపయోగపడటం లేదన్నారు. కెనాల్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల గిరిజన రైతులకు సాగునీరు అందడం లేదని అన్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న అధికారులు రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

రష్మిక 'డీప్‌ఫేక్' నిందితుడి అరెస్టు

- ఆంధ్రప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- నిందితుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ స్వాధీనం

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ప్రముఖ నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ కేసులో ప్రధాన నిందితుడిని ఢిల్లీ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని గుంటూరుకు చెందిన ఈమని నవీన్ (24)ను అరెస్టు చేసినట్టు ఢిల్లీ డీసీపీ హేమంత్ తివారి చెప్పారు. ఇతడే రష్మిక వీడియోను సృష్టించినట్టు అనుమానిస్తున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి ల్యాప్‌టాప్, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రష్మిక పేరుతో కొన్నాళ్లు ఫ్యాన్స్ పేజీని నడిపిన నవీన్.. ఫాలోవర్ల సంఖ్యను పెంచుకొనేందుకు రష్మిక డీప్‌ఫేక్ వీడియో సృష్టించినట్టు తెలిపారు. మరో ఇద్దరు ప్రముఖుల పేర్లతోనూ ఇతడు ఫ్యాన్స్ పేజీలను నడిపినట్టు గుర్తించామని పేర్కొన్నారు. నిందితుడిని విచారిస్తున్నట్టు తెలిపారు.

జారా పటేల్ వీడియోకు రష్మిక ముఖం

బ్లాక్ డ్రెస్‌లో ఉన్న బ్రిటీష్-ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్ జారా పటేల్ వీడియోకు రష్మిక ముఖంతో మార్ఫింగ్ చేశారు. అభ్యంతరకరంగా ఉన్న ఆ వీడియో నిరుడు నవంబర్‌లో వైరల్ అయింది. వీడియోపై పలువురు ప్రముఖులు మండిపడ్డారు. ఢిల్లీ మహిళా కమిషన్ నుంచి పోలీసులకు నోటీసులు అందాయి. ఈ ఘటనపై నవంబర్ పదిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన తర్వాత కత్రినా కైఫ్, కాజోల్ వంటి వారి డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ డీప్ ఫేక్ వీడియో ఈ వారం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కాగా.. శనివారం సోనూసూద్ వీడియో ఒకటి నెట్టింట చక్కర్లు కొట్టింది.